JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 02-05-2026

Medchal - Malkajgiri । Saturday 02-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 335

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 335 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com





# ఆర్టీసీ కార్మికుల పోరాటంలో మేం ఉన్నాం

- అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్ నిర్మిస్తాం
- డీజిల్ పైన ఆర్టీసీ ప్రతి ఏటా రూ.2000 కోట్లు ఖర్చు చేస్తోంది
- ఖర్చు తగ్గించుకోవడానికి ఈవీ బస్సులు
- యూనియన్లు, విలీనం వంటి అంశాలపైన ప్రణాళిక బద్ధంగా కార్మిక సంఘాలే చర్చించుకుని నిర్ణయం చెప్పాలి

**జయభేరి, హైదరాబాద్ :**

మేడే రోజు ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో భేటీ కావడం ఆనందంగా ఉంది. ఆర్టీసీ కార్మికుల పోరాటంలో మేం ఉన్నాం. ప్రజా ప్రభుత్వం రావడంలో వారి పాత్ర ఉంది. ఈ నేపథ్యంలో వాళ్ల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపడం పట్ల కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో పలు విషయాలు పంచుకున్నారు. ఆర్టీసీ మనుగడ, అభివృద్ధితో పాటు గౌరవాన్ని పెంపొందించి ప్రజలకు మంచి సేవలు అందించడానికి ముందుకు వచ్చినందుకు కార్మిక నాయకులకు అభినందనలు. కార్మికులు పట్టుదలతో పనిచేయడం వల్లనే ఆర్టీసీ దేశంలోనే గొప్ప సంస్థగా నిలిచింది. గాజులరామారంలో బస్ టర్మినల్ కోసం 100 ఎకరాలు కేటాయించాం. శంషాబాద్ లో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్ నిర్మిస్తాం. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రోతో అనుసంధానం చేస్తున్నాం. మినీ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అందజేయాలనుకుంటున్నాం. డీజిల్ పైన ఆర్టీసీ ప్రతి ఏటా రూ.2000 కోట్లు ఖర్చు చేస్తోంది. ఆదాయం పెంచుకోవడంతో పాటు ఖర్చు తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. ఖర్చు తగ్గించుకోవడానికి ఈవీ బస్సులను తీసుకురావాలి. సంస్థ బకాయిలు మా హయాంలో పెట్టినవి కావు. కానీ, వాటిని క్లియర్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను మేం చెపట్టాం. యూనియన్లు, విలీనం వంటి అంశాలపైన ప్రణాళిక బద్ధంగా కార్మిక సంఘాలే చర్చించుకుని నిర్ణయం చెప్పాలి. పీఆర్సీ పైన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. మహాలక్ష్మి పథకం పెట్టడం ద్వారా 8 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీకి ఇచ్చాం. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికి ఉద్యోగుల బకాయిలు తీర్చడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఈ సారి ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిలు విడుదల చేశాం....మిగతాది 2 లో

# ఇక పెట్రోల్, డీజిల్ బాదుడేనా..?

## పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర అకస్మాతుగా ధరల పెంపు ఎందుకు చేపట్టారు?



**మే 1వ తేదీన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచడం సంచలనంగా మారింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి మూసివేత వంటివి తీవ్ర ప్రభావం చూపించాయి. ముడి చమురు బ్యారెల్ 126 డాలర్లకు చేరింది. త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.25-28 వరకు పెరిగే అవకాశం ఉందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్యాస్ ధరలు పెంచిన క్రమంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెరగవచ్చనే అంచనాలు ఉన్నాయి.**

**జయభేరి, హైదరాబాద్ :**

మే 1వ తేదీ ఉదయాన్నే షాక్ తగిలింది. కమెర్షియల్ సిలిండర్ ధరలను కేంద్రం భారీగా పెంచింది. ఒక్కో సిలిండర్ పై రూ. 993 పెంచడంతో హోటల్ యజమానులు, క్యాటరింగ్ వంటి వాణిజ్య వినియోగదారులకు ఊహించని షాక్ తగిలింది. ధరల పెంపుతో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.3,071కి చేరింది. హైదరాబాద్‌లో సిలిండర్ ధర రూ. 3,315కు చేరుకుంది. అకస్మాతుగా ధరల పెంపు ఎందుకు చేపట్టారు? అంతర్జాతీయ, యుద్ధ పరిస్థితులు ఏంటి? అనే వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం. సిలిండర్ ధరల పెరుగుదలకు ప్రధానంగా పశ్చిమ ఆసియా యుద్ధం ప్రభావం చూపించింది. అమెరికా, ఇరాన్ మధ్య మొదలైన దాడులు ప్రపంచ ఇంధన రవాణా జరిగే హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో తీవ్రంగా ప్రభావితమైంది. మన దేశానికి వచ్చే 88 శాతం ఎల్పీజీ దిగుమతులు ఈ సంది గుండనే వస్తుంది. సరఫరా ఆగిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 126 డాలర్లు దాటింది. ఫిబ్రవరిలో 73 డాలర్లు ఉన్న ధర ఇప్పుడు దాదాపు రెండింతలు కావడం గమనార్హం....మిగతాది 2 లో



# ఇష్టపడి ఖర్చు పెట్టి.. ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వను

- కోర్టులో అషురెడ్డి

**జయభేరి, హైదరాబాద్, మే 1 :**

ఎన్నారై వేసిన కేసుతో అషూ రెడ్డి పేరు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో, మీడియాలో ఎంతలా చక్కర్లు కొడుతోందో అందరికీ తెలిసిందే. తనను మోసం చేసి 9.3 కోట్లు కాజేసిందంటూ ఎన్నారై పెట్టిన కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. అవన్నీ అవాస్తవాలు అని, తన మీద తప్పుడు వార్తలు రాసే వారిని ఉపేక్షించబోనని, లీగల్‌గా చర్యలు తీసుకుంటాను అని అషూ రెడ్డి ఇన్ స్టాలో పోస్ట్ వేసింది. తాజాగా అషూ తన వాదనల్ని హైకోర్టులో వినిపించినట్టుగా సమాచారం.ఇద్దరి మధ్య పెళ్లికి గానీ, ఈ లెక్కలకు గానీ సంబంధించిన రాతపూర్వక అగ్రిమెంట్స్ ఎలాంటివీ లేవని, ఆయన...మిగతాది 2 లో

# సెగ తప్పదని నేను ముందు చెప్పా

- ఎల్పీజీ ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు
- భారీగా పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర
- మూడు నెలల్లోనే 81 శాతం మేర పెరుగుదల
- ఎన్నికల బిల్లు అంటూ రాహుల్ గాంధీ విమర్శలు

**జయభేరి, న్యూఢిల్లీ:**

వాణిజ్య సిలిండర్ ధరలను కేంద్రం మరోసారి పెంచింది. ఇరాన్, అమెరికా యుద్ధం మొదలైన తర్వాత రెండు నెలల్లోనే ఏకంగా రూ. 1380 పెంచడం గమనార్హం. ఈ పెంపు చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో సామాన్యుల ఇంటి ఖర్చులను ఇది ప్రభావితం చేస్తోందని ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ సెగ గురించి తాను ముందే చెప్పానని అన్నారు.



వాణిజ్య సిలిండర్ ధర, ద్రవ్యోల్బణం పెరుగుదలపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్‌పై ఒక్క రోజే రూ. 993 మేర పెరగడంతో కేంద్రంలోని మోదీ సర్కారుపై రాహుల్ నిప్పులు చెరిగారు. ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణం పెరుగుతుందని తాను ముందే అన్నానని, ఇప్పుడు ధరల్లో కనిపిస్తున్న పెరుగుదల...మిగతాది 2 లో



రాష్ట్ర భద్రతా వ్యవహారాల సలహాదారుగా నియమితులైన శ్రీ బి. శివధర్ రెడ్డి గారు, రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ సీవీ ఆనంద్ గారు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బదిలీపై వివిధ పదవీ బాధ్యతలు చేపట్టిన పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా ముఖ్యమంత్రి గారిని కలిశారు. ఎంసీహెచ్ఆర్డీలో ముఖ్యమంత్రిని కలిసిన అధికారుల్లో శిఖా గోయల్, శ్రీ డీఎస్ చౌహాన్, శ్రీ షానవాజ్ ఖాసీం, తరుణ్ జోషి, శ్రీమతి బి. సుమతి ఉన్నారు.





# గ్యాస్ బండ మోతే మోడీ గిఫ్ట్

**జయభేరి, హైదరాబాద్, మే 1 :**

ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఇక పెట్రోల్, డీజిల్ బాదుడేనా..?

**రేట్లు పెరుగుతాయ్?**

సిలిండర్ ధరల పెంపు అనేది కేవలం హోటళ్లకు మాత్రమే పరిమితం కాదు. ప్రస్తుతానికి గృహ అవసరాల సిలిండర్ (14.2 కేజీలు) ధరను పెంచకపోయినప్పటికీ కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడం వల్ల టిఫిన్స్, హోటల్ ఆహారం ధరలు 20 నుంచి 30 శాతం మేర పెరగడం ఖాయమని చెపబుతున్నారు. హైదరాబాద్‌లోని పీజీ హాస్టళ్లు, చిన్న చిన్న మెస్‌లు ఇప్పటికే మెనూ రేట్లు పెంచేసినట్లు తెలుస్తోంది.

**నెక్స్ట్ పెట్రోల్, డీజిల్ రేట్లేనా?**

పెట్రోల్, డీజిల్ పరిస్థితి సైతం ప్రస్తుతం ఆందోళనకరంగానే ఉంది. ఏప్రిల్ 29తో ఎన్నికల హడావుడి ముగిసింది. ఫలితాల ప్రకటన తర్వాత ధరలు పెరగవచ్చనే వార్తలు వస్తున్నాయి. ఆయిల్ కంపెనీలు తమ నష్టాలు పూడ్చుకునేందుకు సిద్ధమయ్యాయి. కోటక్ ఇన్స్టిట్యూషనల్ ఈక్విటీస్ విశ్లేషణ ప్రకారం.. అంతర్జాతీయంగా చమురు ధరలు 120 డాలర్లు దాటడంతో చమురు కంపెనీలు లీటరు పెట్రోల్‌పై రూ.20, డీజిల్‌పై రూ. 100 వరకు అండర్ రికవరీని చవిచూస్తున్నాయి. దీనిని అధిగమించాలంటే రిటైల్ ధరలు పెంచక తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. లీటరుకు కనీసం రూ. 25 నుంచి రూ. 28 వరకు పెంచాల్సి వస్తుందటా. ఈ పరిస్థితులు చూస్తుంటే రాబోయే మూడు నాలుగు నెలల పాటు చాలా ఇబ్బందులు ఉండనున్నాయని తెలుస్తోంది. ఖతార్‌లోని ఇంధన ప్లాంట్లపై దాడులు జరగడంతో ఇంధన సరఫరా పునరుద్ధరణకు చాలా కాలం పాటు సమయం పడుతుందని సమాచారం. అంటే, గ్యాస్, పెట్రోల్ కోసం ఎక్కువ ధరలు చెల్లించడం తాత్కాలికం కాదని, దీర్ఘకాలిక సమస్యగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికుల పోరాటంలో మేం ఉన్నాం

సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలి. కార్మికులు, ఆర్టీసీ యాజమాన్యం మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఉండాలి. ఈ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాలు ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్(ఆర్), ఆర్టీసీ స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్, ఆర్టీసీ కార్మిక పరిషత్, ఆర్టీసీ స్టాఫ్ & వర్కర్స్ యూనియన్, తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ కార్మిక సంఘ్, ఆర్టీసీ సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్, తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన్ వర్కర్స్ యూనియన్. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సెగ తప్పదని నేను ముందు చెప్పా

అందుకు నిదర్శనమని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. ఒక్క రోజే వాణిజ్య సిలిండర్ ధరను రూ.993లకు పెంచడం చరిత్రలోనే తొలిసారి అని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణం సెగ తగులుతుందని తాను చెప్పిందే నిజమైందని ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ''ఈ రోజు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర రూ.993 పెరిగింది. ఒక్క రోజులో ఇదే అతిపెద్ద పెరుగుదల.. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రూ.1,380 పెరుగుదల అంటే కేవలం మూడు నెలల్లో 81% పెరుగుదల.. ఇది కేంద్రం వసూలు చేస్తున్న ఎన్నికల బిల్లు.. ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణం సెగ తగులుతుందని నేను ముందే చెప్పాను.. చాయ్‌వాలా, ధాబా, హోటల్, బేకరీ, మిఠాయి కొట్టు వంటి చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం ఉంటుంది.. ప్రతి ఒక్కరి వంటగదిపై భారం పెరిగింది. ఇది పరోక్షంగా సామాన్యుల ఇంటి ఖర్చులపై ప్రభావం చూపుతుంది...'' అని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. మొదట గ్యాస్‌పై దాడి, ఆ తర్వాత లిస్ట్‌లో పెట్రోల్, డీజిల్ ఉన్నాయని అన్నారు. కాగా, పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సోం, పుదుచ్చేరి వంటి పలు రాష్ట్రాల్లో ఎన్నికల ముగింపునకు చేరుకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం పెంచుతుందని మంగళవారం రాహుల్ గాంధీ ఆరోపించారు. ''ఎన్నికల ఉపశమనం ముగిసింది.. ఏప్రిల్ 29 తర్వాత ద్రవ్యోల్బణం సెగ రాబోతోంది.. చూస్తూ ఉండండి పెట్రోల్, డీజిల్ సహా ప్రతి ఒక్కటీ ఖరీదైపోతాయి.. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను జేబుల్లో నింపుకుంది.. ఇప్పుడు ధరలు పెరగ్గానే ఆ భారాన్ని ప్రజలపై మోపుతోంది.. చౌకగా దొరికినప్పుడు దోచుకుని, ద్రవ్యోల్బణం భారాన్ని ప్రజలపై వదిలే ప్రభుత్వం ఇది'' అని రాహుల్ విమర్శలు గుప్పించారు.

## గ్యాస్ బండ మోతే మోడీ గిఫ్ట్

ఆయన మాట్లాడారు.కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు.హామీల గురించి అడిగితే బూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎలాగూ మరోసారి ముఖ్యమంత్రి కాబోరని, కానీ ఉన్నన్నాళ్లైనా నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి లెక్కలేదని అన్నారు.

రాహుల్ గాంధీ అడుగు పెడితే ఉన్న ఆటోలు అమ్ముకున్నాడు

తాను కొన్ని కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయం వద్ద కారు అందుబాటులో లేకపోవడంతో మష్రత్ అలీ అనే వ్యక్తి ఆటోను ఎక్కానని తెలిపారు. ఆ సమయంలో ఆయనతో మాట్లాడానని, ఆయన చెప్పిన విషయాల విని ఆందోళన చెందానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే మష్రత్ అలీ ఆటోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కారని, ఆ సమయంలో అతనికి రెండు ఆటోలు ఉండేవని చెప్పారు. రాహుల్ గాంధీ ఎక్కిన తర్వాత ఆయన తన ఆటోలను అమ్మేసుకుని కిరాయి ఆటో నడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కొందరి అడుగు అలా ఉంటుందని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు.

## ఇష్టపడి ఖర్చు పెట్టి..

ఇష్టపూర్వకంగానే ఆ ఖర్చులన్నీ చేశారని అషూ రెడ్డి తన వాదనల్ని వినిపించినట్టుగా తెలుస్తోంది. ఇందులో ఎలాంటి బలవంతం లేదని చెప్పిందట. తనను, తన కుటుంబాన్ని పెళ్లికి ఒప్పించే క్రమంలోనే, తన కుటుంబాన్ని మచ్చిక చేసుకునేందుకే అవన్నీ ఖర్చు పెట్టాడని అషూ రెడ్డి పేర్కొందట.అతను తన వ్యక్తిగత నిర్ణయం మేరకు చేసిన ఖర్చులకు తాను ఎలాంటి బాధ్యత వహించబోనని, తనకు వాటితో సంబంధం లేదని అషూ రెడ్డి చెప్పుకొచ్చిందట. సీసీఎస్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఎలాంటి వాస్తవాలు లేవని, అందుకే ఆ కేసుని కొట్టేయాలని కోర్టులో ఆమె అభ్యర్థించినట్టుగా సమాచారం. ఈ కేసుని, అషూ వాదనల్ని విన్న కోర్టు.. ఈ కేసులోని లోటు పాట్లను పరిశీలించేందుకు సిద్ధమైంది. అషూ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటీషన్‌పై పూర్తి వివరాల్ని సమర్పించాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వ కౌన్సిల్‌ను న్యాయస్థానం ఆదేశించింది.మరి ఈ కేసులో ముమ్ముందు ఎలాంటి వాదనలు వినాల్సి వస్తుందో.. చివరకు న్యాయం ఎవరి వైపు ఉందో.. తీర్పు ఎలా వస్తుందో చూడాలి. మొత్తానికి ఈ వ్యవహారంతో అషూ రెడ్డి మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. మొన్నటి వరకు ఇన్ స్టా సబ్ స్క్రిప్షన్‌తో అషూ రెడ్డి నెట్టింట్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఇలా ఈ కేసుతో మరోసారి ట్రెండ్ అవుతోంది.

# పెట్రోలియం ఉత్పత్తులపై రేషనింగ్




నెల క్రితం అంతర్జాతీయంగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత ఇంధన భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో భారత్ వద్ద సుమారు 66 రోజుల వినియోగానికి సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గత నెల రోజులుగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, ప్రధాన సముద్ర మార్గాల్లో రవాణాకు ఆటంకాలు కలగడం వల్ల దిగుమతుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి.భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతోంది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 4.5 నుంచి 5 మిలియన్ బారెళ్ల ముడి చమురును మనం దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ, ప్రస్తుత సరఫరా ఆటంకాల వల్ల ఈ దిగుమతుల్లో 10 నుంచి 15 శాతం వరకు లోటు కనిపిస్తోంది. రష్యా నుంచి వచ్చే చమురు రవాణా మార్గాల్లో బీమా ,షిప్పింగ్ సమస్యలు తలెత్తడం, గల్ఫ్ దేశాల నుంచి వచ్చే సరఫరాలో జాప్యం జరగడం వల్ల రిఫైనరీలకు అందే ముడి చమురు పరిమాణం తగ్గింది.

ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం గయానా , బ్రెజిల్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, రవాణా ఖర్చులు పెరగడం సవాలుగా మారింది.దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందని ఈ కారణంగానే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రస్తుతం ఎటువంటి తక్షణ కొరత లేదని, ప్రజలు భయాందోళనతో కొనుగోళ్లు చేయవద్దని విజ్ఞప్తి చేస్తోంది. అయితే, రిటైల్ మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలో కొన్ని చమురు కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. చమురు ధరలు బారెల్ కు 100 డాలర్ల మార్కును దాటి స్థిరంగా కొనసాగితే, భారత్ వంటి దిగుమతి దేశాలపై ద్రవ్యోల్బణ భారం విపరీతంగా పెరుగుతుంది.పశ్చిమాసియాలో పరిస్థితులు మారకపోతే ఇంధన రేషనింగ్ వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి రావచ్చు.రాబోయే రెండు వారాల్లో దిగుమతులు మళ్ళీ గాడిలో పడతాయని, కేంద్రం రష్యా , ఇతర దేశాలతో జరుపుతున్న చర్చలు సఫలమైతే పెట్రోల్, డీజిల్ కొరత సమస్య తలెత్తదని కేంద్రం నమ్మకంతో ఉంది.

కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినట్లుగా వస్తున్న ఊహాగానాల్ని కొట్టిపారేసింది. మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ విభాగం నుంచి ధరల పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటనా రాలేదని.. నకిలీ ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఫేక్ సోషల్ మీడియా పోస్టుల్ని కోట్ చేస్తూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఈ ఆర్డర్ నకిలీది. భారత ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వుల్ని అసలు జారీ చేయలేదు.' అని అందులో పేర్కొంది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లీడర్లు ఈ నకిలీ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.దేశంలో పెట్రోల్ ధర రూ. 10, డీజిల్ ధర రూ. 12.50 పెరిగినట్లు.. భారత పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుంచి సర్క్యులర్ వచ్చినట్లుగా ఉన్న ప్రెస్ నోట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. దీనినే నకిలీది అని కేంద్రం స్పష్టం చేసింది. ఇలాంటి నకిలీ వార్తల్ని, ప్రకటనల్ని నమ్మొద్దని.. ఇలాంటి వార్తల్ని ధ్రువీకరించుకునేందుకు ఎల్లప్పుడూ అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఛానెళ్లను చూడాలని స్పష్టం చేసింది. దేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 94.77 గా ఉండగా.. డీజిల్ రూ. 87.67 పలుకుతోంది. ముంబైలో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ. 103.54, రూ. 90.03 వద్ద ఉన్నాయి.

ఇక హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద ఉండగా.. డీజిల్ ధర రూ. 95.70 వద్ద ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే.. హైదరాబాద్‌లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయి.దేశంలో ఇటీవల 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 29నే బెంగాల్‌లో చివరి దశ పోలింగ్‌తో.. ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో.. కొద్ది రోజుల ముందు నుంచే దేశంలో.. ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరల్ని కేంద్రం పెంచుతుందని వార్తలు వచ్చాయి. అయితే అలాంటిదేం ఉండదని.. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, కేంద్రం కూడా బదులిస్తూ వచ్చాయి.అమెరికా ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు రవాణాకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. మరోవైపు ఇరాన్ ఓడరేవుల్ని అమెరికా దిగ్బంధించింది. అక్కడ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. భారత్‌లోనూ నిల్వలు తక్కువగా ఉన్నాయి. క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఒకవైపు.. కొన్ని పెట్రోల్ బంకులు రద్దీగా కనిపిస్తుంటే.. కొన్ని నో స్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. దీంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే సమయంలో ధరల్ని పెంచుతుందని ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం క్రూడాయిల్ ధర ఏప్రిల్ 30న.. 125 డాలర్ల మార్కును చేరి.. నాలుగేళ్ల గరిష్ఠానికి చేరింది.అటు సరఫరాను పునరుద్ధరించడం, ఇటు ధరలను అదుపులో ఉంచడం ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారింది. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా, అంతర్జాతీయ పరిణామాలను బట్టి రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు మంత్రం పాటించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

## యూరో ఎగ్జిమ్ బ్యాంక్‌పై అసత్య కథనాలు

**జయభేరి, హైదరాబాద్, మే 1:**

యూరో ఎగ్జిమ్ బ్యాంక్ జారీ చేసిన గ్యారంటీలు నకిలీవని, ఆ సంస్థ ఆర్థిక మోసాలకు పాల్పడుతోందని వెలిచేటి రవి ప్రకాష్ ఆధీనంలోని ఆర్ టీవీ కథనాలు ప్రసారం చేయటాన్ని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ తొమ్మిదో అదనపు చీఫ్ జడ్జి కె.మురళీమోహన్ తప్పు పట్టారు. జర్నలిజం స్వేచ్ఛ పేరుతో అసత్య కథనాలు సరికాదని కోర్టు స్పష్టం చేసింది. ఆర్ టీవీ ప్రసారం చేసిన కథనాలకు సంబంధించి ఏ ఒక్క ఆధారాన్ని కోర్టుకు సమర్పించలేదని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. యూరో ఎగ్జిమ్ బ్యాంక్‌పై "మెగా స్కామ్" అంటూ ఆర్ టీవీ 2024 జులై, ఆగస్టు నెలల్లో ప్రసారం చేసిన నిరాధార, అపకీర్తికర ప్రసారాలపై తాత్కాలిక నిషేధాజ్ఞ జారీ చేసింది. బ్యాంక్‌పై ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలను కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. యూరో ఎగ్జిమ్ బ్యాంక్ జారీ చేసిన గ్యారంటీలు "నకిలీవి", బ్యాంక్ "భారీ ఆర్థిక మోసం"లో పాల్గొంటోంది అని ఆర్ టీవీ వార్తా కథనాలు ప్రసారం చేసింది. అలాగే ఆర్‌బీఐ, ఫెమా నిబంధనలను ఉల్లంఘిస్తోంది అంటూ ఆ కథనాల్లో ఆరోపణలు ప్రసారం చేసింది. ఈ కథనాలపై బ్యాంక్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా కోర్టు ప్రత్యర్థుల వాదనలను సమీక్షించి, వారు చేసిన ఆరోపణలకు సంబంధించి ఎటువంటి పత్రాధారాలు, ధృవీకరించదగిన సమాచారం, విశ్వసనీయ మూలాలను సమర్పించలేదని గమనించింది. బ్యాంక్ గ్యారంటీలు మోసపూరితమైనవని నిరూపించడానికి ఎటువంటి ప్రాథమిక ఆధారాలు ఆర్ టీవీ, దాని యజమాని సమర్పించలేదు. బ్యాంక్‌పై చేసిన తీవ్రమైన ఆరోపణలకు మద్దతుగా ప్రత్యర్థులు "ఒక చిట్టి కాగితం కూడా" సమర్పించలేదు.హవాలా లావాదేవీలు, అక్రమ గ్యారంటీలు, ఆర్‌బీఐ, ఫెమా ఉల్లంఘనలపై ఎటువంటి అధికారిక చర్యలు లేదా క్రిమినల్ కేసులు నమోదైనట్టు ఆధారాలు లేవు. నిర్ధారణ లేని ఆరోపణల వల్ల బ్యాంక్ ప్రతిష్ఠకు, వ్యాపార ప్రయోజనాలకు తిరుగులేని నష్టం కలగవచ్చని కోర్టు అభిప్రాయపడింది. యూరో ఎగ్జిమ్ బ్యాంక్ నికర విలువ కేవలం ₹8 కోట్లు మాత్రమేనని ఆర్ టీవీ తన కథనంలో పేర్కొంది. అయితే ఈ వాదనకు ఎటువంటి ఆధారాలు సమర్పించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఆర్ టీవీ కథనం తప్పు అని నిరూపించేలా బ్యాంక్ తన అధికారిక ఆర్థిక పత్రాలను సమర్పించి, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ ప్రకారం తమ నికర విలువ ₹1,900 కోట్లకు పైగా ఉందని కోర్టుకు తెలిపింది. ఈ సందర్భంగా యూరో ఎగ్జిమ్ బ్యాంక్‌పై ధృవీకరణ లేని ఆరోపణలు ప్రసారం చేయరాదని కోర్టు స్పష్టం చేసింది. అపకీర్తికర లేదా అవమానకర శీర్షికలతో ప్రసారాలు చేయరాదని ఉత్తర్వులో పేర్కొంది. భవిష్యత్తులో ఈ అంశంపై ఏదైనా ప్రసారం/ప్రచురణ జరిగితే, అది O.S. No. 413/2024 కేసులో విచారణలో ఉందని స్పష్టంగా ఆడియో, వీడియో రూపంలో తెలియజేయాలని పేర్కొంది. అదే విధంగా జర్నలిజం స్వేచ్ఛ రాజ్యాంగబద్ధ హక్కే అయినప్పటికీ, అది బాధ్యతాయుతంగా, వాస్తవాధారాలతో ఉండాలి. నిరాధార ఆరోపణలు లేదా సంచలనాత్మక ప్రసారాలు స్వేచ్ఛ పేరుతో సమర్థించబడవని కోర్టు పేర్కొంది. ఇదే వ్యవహారానికి సంబంధించి 2025 మార్చిలో బొంబాయి హైకోర్టు కూడా రవి ప్రకాష్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని కొట్టివేసింది. వాస్తవాలను దాచిపెట్టడం, సరైన ఉద్దేశం లేకపోవడం కారణాలుగా కోర్టు పేర్కొంది.

## వచ్చే ఎన్నికల టార్గెట్‌గా అడుగులు



- ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ
- శుక్రవారం నుంచే ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం
- పనితీరు బాగోలేకపోతే ఇంకో ఛాన్స్ ఉండదని స్పష్టం

**జయభేరి, కృష్ణా జిల్లా :**

2029 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభించారు. ముఖ్యమంత్రిగా వివిధ సమావేశాలు, సభలకు హాజరవుతుంటారు చంద్రబాబు. ఈ సందర్భంగానే ఆ ప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యే పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటానని చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలలో చంద్రబాబు పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం (మే 1) నుంచే ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు అంతర్గత సర్వేల ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నారు చంద్రబాబు. పనితీరు సరిగా లేని ఎమ్మెల్యేలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. ప్రజల్లోకి మరింతగా వెళ్లాలని, ప్రజా క్షేత్రంలో ఉండాలంటూ సూచనలు, సలహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలను కూడా నిర్వహించారు. అయితే ఎమ్మెల్యేల పనితీరుపై ఇక నుంచి నేరుగా ప్రజల నుంచే అభిప్రాయాలు తెలుసుకోవాలని భావిస్తున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాల కోసం సీఎం చంద్రబాబు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూ ఉంటారు. ఈ సందర్భంగా సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ సమావేశాల సందర్భంగా ఆ ప్రాంత ఎమ్మెల్యేల పనితీరును ప్రజల నుంచి తెలుసుకోనున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేస్తున్నారు. పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనేందుకు గానూ చంద్రబాబు శుక్రవారం రోజున కృష్ణా జిల్లా పమిడిముక్కలలో పర్యటించారు. ఈ సందర్భంగానే ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రతి సమావేశంలో ఆ ప్రాంత ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలను అడుగుతానన్న చంద్రబాబు.. పనితీరు బాగోలేకపోతే ఇంకో ఛాన్స్ ఉండదని స్పష్టం చేశారు. "ఎమ్మెల్యే పనితీరు గురించి ఈ రోజు నుంచి సమావేశాల్లోనే ప్రజలను అడుగుతా. మీరు చేతులెత్తకపోతే ఎమ్మెల్యే తన పనితీరు మార్చుకోవాలి. ఎమ్మెల్యేలు పనితీరును సరిదిద్దుకోకపోతే ప్రజల తరుపున ఉంటాను కానీ.. ఎమ్మెల్యేల తరుపున ఉండను. వారికి మళ్లీ ఛాన్స్ ఉండదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామన్న చంద్రబాబు.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీని బరువుగా కాకుండా బాధ్యతలా చూస్తున్నామన్న చంద్రబాబు.. ఇందుకోసం ఏడాదికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాల లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇదే సమయంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల వరకూ విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చారు. కర్నూలు, గుంటూరు, అచ్యుతాపురం, అమరావతి, తిరుపతి, శ్రీసిటీలో ఈఎస్ఐ ఆస్పత్రులు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

# జర్నలిస్టులను హత్య చేసిన వాళ్లను ఎన్కౌంటర్ చేయాలి

- పాశం యాదగిరి
- జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలి: కె కోటేశ్వరరావు
- జర్నలిస్ట్ హత్యకు నిరసనగా హైదరాబాద్ ఆర్ట్స్ కాలేజీ వద్ద క్యాండిల్ ర్యాలీ
- అవినీతి అక్రమాలను బయట పెడుతున్న జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు, హత్యలు ఇదేనా
- అవినీతి అక్రమాలను ప్రశ్నించేది అడిగేది ఎవరు.? వాస్తవాలు రాయకుంటే అవినీతి అక్రమాలే రాజమేలుతాయి
- జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయింది, వెంటనే "జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్" తీసుకురావాలి



**జయభేరి, హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాలలో మరోసారి జర్నలిస్టుల భద్రత అంశం వేడెక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ముందు సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, కె. కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసనలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సాయంత్రం వేళ ప్రారంభమైన ఈ ర్యాలీ భావోద్వేగభరితంగా సాగింది. చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని, "జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి", "నిజం రాస్తే నరహత్యలా.?" వంటి నినాదాలతో పాల్గొన్నవారు న్యాయం కోరారు. హత్యకు గురైన జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ దేశంలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం అయిన మీడియాపై దాడులు పెరుగుతున్నాయి. వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులు లక్ష్యంగా మారుతున్నారు. వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని మండిపడ్డారు. మరో ముఖ్య అతిథి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ నిజం రాసే వారికి బెదిరింపులు, అక్రమ కేసులు, చివరకు హత్యలు జరుగుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర పరిణామని హెచ్చరించారు.

ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు, రాజకీయ నాయకులు మాఫియాలకు అండగా నిలవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. అక్రమాలు, అవినీతి బయటపెట్టే జర్నలిస్టులను కనుమరుగు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని దీనిని సమాజం సహించకూడదని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న పలువురు యువ జర్నలిస్టులు మాట్లాడుతూ తమకు భద్రతపై తీవ్ర ఆందోళన ఉందని వాస్తవాలు రాయలేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. నిజం రాయాలా.? లేక ప్రాణాలు కాపాడుకోవాలా.? అనే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, దాడులకు పాల్పడిన వారిపై వేగంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో చివరగా మృతి చెందిన జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి కి నివాళులు అర్పిస్తూ ముగిసింది. అయినప్పటికీ, జర్నలిస్టుల భద్రతపై ఉన్న అనిశ్చితి మాత్రం ఇంకా తొలగలేదని స్పష్టమైంది. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులకు స్వేచ్ఛా, రక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసనకారులు హెచ్చరించారు.



## మండు టెండలో మహా సాహసం చేసిన వాసవి క్లబ్

**జయభేరి, మేడిపల్లి :**

గత కొద్ది రోజులుగా ఎండల మూలంగా వాతావరణంలో మార్పుతో ప్రజలు వేడిమి తాపం తట్టుకోలేని పరిస్థితి ఉదయం ఎనిమిది కాగానే సూర్య ప్రతాపం చవి చూసే క్రమంలో బోడుప్పల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చైర్మన్ శ్రీ పొద్దుటూరి శోభా రాణి వెంకటేష్ గుప్తా మరియు క్లబ్ అధ్యక్ష కార్యదర్శి కమిటీ సహకారంతో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎండ వేడి నుండి ప్రజలకు కాస్త సేద తీరే విదంగా "మజ్జిగ" పంపిణి కార్యక్రమం జరిగింది ఇట్టి కార్యక్రమం లో rtc సిబ్బంది. ఆటో. ఆటో ట్రాలీ సిబ్బంది. దారిలో వెళ్లే ప్రతీ ఒక్కరు చల్లని మజ్జిగ సేవించి క్లబ్ మెంబెర్స్ కి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పొద్దుటూరి శోభా రాణి వెంకటేష్ గుప్తా అధ్యక్షులు కార్యదర్శి రాజేందర్. శ్రీనివాస్ మాటల్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గత పదకొండు సంవత్సరాలనుండి సామాజిక సేవా కార్యక్ర మాలు చెట్లు నాటడం స్కూల్ లో బుక్స్ పంపిణీ. మోటివేషన్ క్లాసులు వివిధ రకాల ప్రజా అవసర కార్యక్రమం మా క్లబ్ మెంబెర్స్ సహకారంతో ప్రతీ సంవత్సరం ఎండ కాలం లో మజ్జిగ పంపిణి కార్యక్రమం చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్బంగా సామజిక కార్యకర్త రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు డా లక్ష్మివీరమల్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వాసవి క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని క్లబ్ ఆధ్వర్యంలో ఇంకా అనేక ప్రజా కార్యక్రమాలు దిగ్విజయం గా కొనసాగించాలి అని క్లబ్ వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం లో పాల్గొన్న సామాజిక కార్యకర్త వేణు కూడా వాసవి క్లబ్ వారిని కొనియాడుతూ ఈ క్లబ్ ఇంకా అనేక జిల్లాలో కూడా సేవా కార్యక్ర మాలు చేస్తూ ప్రజల అత్యంత అవసరాలు తీర్చే ౦ దుకు ముందుకు పోతుంది అని క్లబ్ నిర్వాహకులను అభినదించారు.



## వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

- హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి
- సాంప్రదాయ రీతిలో తలంబ్రాల ఘట్టం
- అలంకరణలో భక్తకోటికి స్వామి వారి దర్శనం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన, రాయచూర్ అంతర్రాష్ట్ర సమీపంలోనున్న శ్రీ లక్ష్మీనరసింహ (ఓబులేషు) స్వామివారి వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మూడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. దేవాలయానికి వచ్చిన మంత్రి, ఎమ్మెల్యే లకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి ఉత్సవాలు గత నెల 30న అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల లోని ప్రధాన ఘట్టమైన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని దేవస్థానం ముందు నూతనంగా నిర్మించిన మండపంలో కనుల పండువగ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని కళ్యాణమండపానికి ఊరేగింపుగా తీసుకువెళ్లి సాంప్రదాయ రీతిలో పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య కల్యాణ మహోత్సవాన్ని అనుకున్న ముహూర్తానికి నిర్వహించారు. సాంప్రదాయ రీతిలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహించారు. పురహితులు వేదమంత్రాలు చదువుతుండగా, అశేష భక్త జనావళి తిలకిస్తుండగా మంగళసూత్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలంకరణలో ఉన్న స్వామి వారిని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ సందర్భంగా స్వామివారికి మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మూడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో మన్యంకొండ దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, పాలక మండలి సభ్యులు, దేవస్థానం పూజారులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి కోనుగోలు లో పాత విధానామే పాటించాలి

**జయభేరి, సికింద్రాబాద్ :**

బోయిన్ పల్లిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్న సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వరి కొనుగోలు విధానంలో పాత విధానాన్నే పాటించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశ పెట్టిన ఆన్ లైన్ విధానం వలన రైతులు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అత్యధికంగా 64లక్షల టన్నుల ధాన్యం పండించారని, ఆన్ లైన్ ద్వారా కేటాయించిన మిల్లుల వద్దకు వెళితే కనుగోలు చేయకుండా లేనిపోని అభ్యంతరాలు తెలుపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం పాత విధానాన్ని అమలు చేయాలని ఆదేశించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పూనుకొని సమన్వయం చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తే కష్టపడి పండించిన ఆ రైతులకు ఆత్మహత్యలే శరణమయ్యే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు

**జయభేరి, మేడిపల్లి :**



బోడుప్పల్ సర్కిల్ 11వ డివిజన్ ఇందిరా నగర్ కాలనీ లో చౌరస్తాలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించడం జరిగినది. ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో సిపిఐ పార్టీ మరియు ఏఐటీయూసీ జండాలను సీనియర్ నాయకులు విబి బాలరాజ్ మరియు దండ రమేష్ లు జండా ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రామికులు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని — అంటే మేడేని — గర్వంగా జరుపుకుంటారు. ఈ మేడే 1886వ సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో లక్షలాది కార్మికులు రోజుకు 16 నుండి 18 గంటలు పని చేయవలసిన దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. "రోజుకు 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు మన కోసం" అనే నినాదంతో కార్మికులు మే 1న సమ్మె బాట పట్టారు. వేల మంది కార్మికులు చికాగో వీధుల్లో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. మే 4వ తేదీన హే మార్కెట్ స్క్వేర్ లో జరిగిన సభలో పోలీసులు మూకపై లాఠీలు ఝుళిపించారు. అనామక వ్యక్తి ఒక బాంబు విసిరాడు — పోలీసులు కాల్పులు జరిపారు. అనేక మంది కార్మికులు అమరులయ్యారు. ఆ నాయకులకు ఉరిశిక్ష విధించారు. అయితే వారి బలిదానం వ్యర్థం కాలేదు. 1889లో పారిస్ లో జరిగిన రెండవ అంతర్జాతీయ కార్మిక సమావేశం మే 1వ తేదీని అధికారికంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రకటించింది. నేడు 80కి పైగా దేశాలు ఈ రోజును జాతీయ సెలవు దినంగా పాటిస్తున్నాయి. భారతదేశంలో తొలిసారి మేడే 1923లో చెన్నైలో జరుపుకున్నారు. కార్మిక నాయకుడు సింగారవేలర్ నేతృత్వంలో నిర్వహించిన ఆ కార్యక్రమంలో మొదటిసారి ఎర్రజెండా రెపరెపలాడింది. అప్పటి నుండి ఈ దేశంలో కార్మికుల ఉద్యమం బలపడుతూ వచ్చింది. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు, బీసీ సంఘం జిల్లా నాయకులు కే ప్రమీల, బాపురాజు, బి కే ఎం యు మండల కార్యదర్శి & అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు నరసమ్మ, దండు మదర్, తమన్నా, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, వెన్నెల ఆటో సంఘం అధ్యక్షులు జి యాకయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జూన్ 2 నాటికి జర్నలిస్ట్ ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

- న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్ల స్థలాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**



అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్ లో జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్, తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రి సొసైటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.

గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్ స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువ



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గం నెహ్రూ నగర్ కేబుల్ చౌరస్తా సమీపంలో రెహబోతు ప్రార్ధనా మందిరము ఆధ్వర్యంలో ఏప్రిల్ 21 నుండి మే ఫస్ట్ వరకు క్రైస్తవ చిన్నారుల కోసం నిర్వహించిన ఒకేషనల్ బైబిల్ క్లాసెస్ విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా హెచ్ సి ఎల్ చౌరస్తా నుండి రెహబోతు ప్రార్ధన మందిరం వరకు ర్యాలీగా వెళ్లగా, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి విచ్చేశారు. విశిష్ట అతిథులుగా మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారులకు బైబిల్ ప్రాసెస్ విజయవంతంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మరి ఈ వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలని జాగ్రత్తగా చూసుకోవాలంటూ తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు టిటస్, సామ్యూల్ రెడ్డి, స్థానిక నాయకులు నాగారం బాబు, రఘు, శీలం ప్రవీణ్, విజయ్ చిట్యాల, ప్రవీణ్, నరేష్, విజయ్, సంజీవ్, శేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



**జయభేరి, కాప్రా :**

కుషాయిగూడలో ఏర్పాటు చేసిన 54 అడుగుల శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఇలాంటి మహత్తరమైన ఆధ్యాత్మిక క్షేత్రం ఏర్పడడం ఆనందకరమని తెలిపారు. భక్తులందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించబడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

## మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనం

**జయభేరి, కాప్రా :**

కుషాయిగూడలోని జీజీ కన్వెన్షన్ లో యాంటీ డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని, సమాజంలోని ప్రతి ఒక్కరూ దీనిపై చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వార్తాచారి పుట్టిన రోజు సందర్భంగా ఈ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఉప్పల్ అడిషనల్ డీసీపీ వెంకట రమణ, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, గోళ్లురి అంజయ్య, BRS పార్టీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, మహేష్ గౌడ్ నవీన్ గౌడ్, SI వెంకన్న స్థానిక నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం నుండి దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించాలని డీసీపీ సూచించారు.

# మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడాలి

- పరకాలలో ఘనంగా మేడే
- కార్మికుల ప్రదర్శనలో బొట్ల చక్రపాణి పిలుపు

**జయభేరి, పరకాల, మే 01:**



కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులను యజమానులకు కట్టు బానిసల్లాగా మార్చే విధంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రదద్దు అవెంతవరకు మేడే స్ఫూర్తితో పోరాడాలని సిఐటియు జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. శుక్రవారం పరకాల పట్టణంలో ఎర్రజెండాలతో నిండిపోయింది. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, దిగుమతి, ఎఫ్‌సిఐ, మార్కెట్ హమాలీ యూనియన్లతో పాటు బిల్డింగ్ వర్కర్స్, మున్సిపల్, ఆర్టీసీ కార్మికులు సీఐటీయూ ఎర్రజెండాను సిపిఎం జెండాను పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రపంచ కార్మికులారా ఏకంకండి', 'కార్మిక ఐక్యత వర్ధిల్లాలి' అనే నినాదాలతో హోరెత్తిస్తూ మాదారం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. దశాబ్దాల పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని నాలుగు కోడ్‌లుగా మార్చడం కార్మిక వర్గానికి గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, శ్రమజీవుల హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. ఎనిమిది గంటల పని దినానికి బదులు 12 గంటలకు పెంచి అమరవీరులు ఏళ్ల తరబడి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వంలో కాలరా యబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ, సామాజిక భద్రత లేకుండా కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కార్మికులందరూ ఐక్యమై కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై రాజీలేని పోరాటం చేయాలని చక్రపాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ సిపిఎం నాయకులు మడికొండ ప్రశాంత్ బొచ్చు ఈశ్వర్, సిఐటియు మండల నాయకులు బొచ్చు ఆదాం, మడికొండ ప్రమోద్ ,భయ్యా కృష్ణంరాజు,రమేష్, మోహన్ ,సాంబయ్య ,సారయ్య కమల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నో ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన ఎమ్మెల్యే జీఎంఆర్


- బీటి రోడ్డున పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్
- ఎమ్మెల్యే జిఎంఆర్ కు తండా వాసుల కృతజ్ఞతలు

**జయభేరి, దేవరకద్ర :**

ఎన్నో ఏళ్ల ఆకాంక్షను మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) నెరవేర్చారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ నుండి వయా మిట్యా తండా, లంబాడి కుంట తండా, ముసలయ్య పల్లి, పెద్ద తండాల మీదుగా కరివేన వెళ్లే బీటీ రోడ్ నిర్మాణం పూర్తయిన సందర్భంగా బీటీ రోడ్డును ఎమ్మెల్యే జీఎంఆర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్ల నాటి ఆకాంక్షలు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఆయా తాండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నెరవేరిన తాండవాసుల ఆకాంక్ష

- ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవతో బీటీ రోడ్డు పనులు పూర్తి
- ఆనందం వ్యక్త పరుస్తున్న తాండవాసులు

**జయభేరి, దేవరకద్ర :**

ఆ తాండ వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. గత కొన్ని ఏలుగా తమ తండాలకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆ తాండవాసుల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా ఏర్పడింది. ఈ సమస్యను తాండవాసులు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే జిఎంఆర్ వెంటనే స్పందించి ఆ తాండలకు బిటి రోడ్డు వేయించారు. దీంతో ఆ తండావాసులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ కు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఎన్నో ఏళ్ల ఆకాంక్ష నెరవేరడంతో ఆ తండావాసులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ పనితీరును అభినందిస్తున్నారు. ఇన్నేళ్లు గతుకుల మయంగా ఉన్న రోడ్డు ప్రస్తుతం చూడ ముచ్చటగా కనిపిస్తుంది.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

- తపోవన్ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత





**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం డోకూర్ తపోవన్ ప్రవేట్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని వైష్ణవి 564 మార్కులు సాధించి పాఠశాల టాపర్ గా నిలిచింది. అలాగే కరుణశ్రీ 560, జనని 557, చేతన్ రెడ్డి 552, దీక్షిత 551 మార్కులు సాధించారు. 19 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా లను యువత సద్వినియోగం చేసుకోవాలి



**జయభేరి, దేవరకద్ర :**

జాబ్ వేళాలను యువత సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామం లో శుక్రవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జాబ్ మేళా కార్యక్రమాన్ని రాష్ట్ర పశుసంవర్ధక మరియు యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ లతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడమే కాకుండా యువతకు ప్రవేట్ రంగంలో కూడా ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో పెద్ద,పెద్ద కార్పొరేట్ కంపెనీలతో చర్చించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో జాబ్ వేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మూఢ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రి లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

- ప్రభుత్వం , ఆర్టీసీ జేపీసీ మధ్య చర్చలు సఫలం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆర్టీసీ కార్మికులు.

**జయభేరి, శామీర్‌పేట్, మే 1 :**



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో మేడ్చల్ జిల్లా హకీంపేట లోని ఆర్టీసీ డిపోలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వం 11 శాతం పీఆర్సీ అమలు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఆర్టీసీ సంఘాల ఎన్నికలకు అనుమతి ఇవ్వడం వంటి ముఖ్య నిర్ణయాలు తీసుకుంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపినందుకు గాను ఆర్టీసీ జేఏసీ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హకీంపేట్ డిపోలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గార్ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆర్టీసీ కార్మికులకు స్వీట్లు,పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. అదేవిధంగా మేడే సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు డిపో మేనేజర్ సరిత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు ఆర్టీసీ జేఏసీ మధ్య సానుకూల వాతావరణంలో జరిపిన చర్చలు సఫలం కావడం సంతోషించదగ్గ విషయం అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సరితా దేవి, ఎంఫ్ రామ్మోహన్, సెక్యూరిటీ హెడ్ సుదర్శన్, ఆర్టీసీ నాయకులు గోపు శ్రీనివాస్, వెంకటేష్, రామచందర్, కేపీ రావు, రమేష్, రఘురాములు, బాలచందర్, విద్యారాణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, పారనంది బాల్ రాజు, మహమ్మద్ జాఫర్, వజ్జల శేశాంత్, నాయకులు మిర్యాలకర్ సాయి కుమార్, శ్రీకాంత్, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కమిషనర్‌గా ఎన్. వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- బదిలీపై వెళ్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌కు ఘన సన్మానం చేసిన చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్‌పేట్, మే 1 :**



అలియాబాద్ మున్సిపాలిటీ పరిపాలనలో కీలక మార్పు చోటుచేసుకుంది. అలియాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఎన్. వెంకట్ రెడ్డి గురువారం అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వెంకట్ రెడ్డి బదిలీపై అలియాబాద్ మున్సిపాలిటీకి నియమితులయ్యారు. ఇక మున్సిపాలిటీ ఏర్పాటు జరిగిన నాటి నుండి కమిషనర్‌గా సేవలందించిన చంద్రశేఖర్ బదిలీపై వెళ్లనుండటంతో మున్సిపల్ కార్యాలయంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి నూతన కమిషనర్ వెంకట్ రెడ్డి మరియు బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్‌లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత 11 నెలల కాలంలో కమిషనర్ చంద్రశేఖర్ మున్సిపాలిటీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాల్లో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పరిపాలనను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రశేఖర్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే నూతన కమిషనర్ వెంకట్ రెడ్డి అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. నూతన కమిషనర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



# కోయిల్ సాగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**జయభేరి, దేవరకద్ర :**





మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మొత్తం 42 మంది విద్యార్థులు ఏడాది పరీక్షలు హాజరుకాగా ఇందులో 38 మంది విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇందులో షేక్ అమీనా కౌసర్ 525 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే బాతుల భరత్ కుమార్ 492 మార్పులు సాధించి ద్వితీయ స్థానం, 483 మార్కులు సాధించి ఈర నాగూర్ పూజ మూడవ స్థానంలో నిలిచారు. గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల 10వ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. దీంతో పాఠశాలలో పదోతరగతి పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు అభినందించారు.



# నేడు దేవరకద్రలో ప్రజా ప్రతినిధుల సభ

- హాజరుకానున్న జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక శ్రీనివాస గార్డెన్ లో దేవరకద్ర నియోజకవర్గం ప్రజాప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో పాటు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అధికారులు హాజరవుతారని వారు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి దేవరకద్ర మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 01 :**

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి నుంచి భువనగిరి రైల్వే స్టేషన్ల మధ్యన గురువారం సాయంత్రం జరిగింది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వంగపల్లిభువనగిరి రైల్వే స్టేషన్ల మధ్యన రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటాయని,ఎరుపు రంగు స్వెట్టర్,తెలుపు రంగు బనియన్, నలుపు రంగు ప్యాంట్ ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాల తెలిసిన వారు 98482 22169 నంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 01 :**

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడికి జైలు శిక్ష పడినట్టు యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021సంవత్సరంలో యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లికి చెందిన ముక్కెర్ల కొమురయ్య తనను తీవ్ర ఇబ్బందికి గురి చేశారని అదే ప్రాంతానికి చెందిన చెందిన వెంకటేశ్ మరణం వాగ్మూలం రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదగిరిగుట్ట పోలీసులు నిందితుడు కొమురయ్యపై ఐపీసీ 306,సెక్షన్ 3(2) ఎస్టీ, ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి నల్లగొండ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కోర్టులో ప్రవేశపెట్టారు. సుదీర్ఘంగా విచారించిన కోర్టు నిందితుడు ముక్కెర్ల కొమురయ్యకు 10 ఏళ్ల జైలు శిక్ష విధించిందని సీఐ బాస్కర్ వెల్లడించారు.

# వివాహ వేడుకల్లో హైకోర్టు న్యాయవాది



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం కురుమూర్తి లో శుక్రవారం నడిమింటి భాస్కర్ గౌడ్ కుమారుడి వివాహ వేడుకల్లో హైకోర్టు న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

# స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు

**జయభేరి, దేవరకొండ :**

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్ లో ఉయ్యాల కార్యక్రమం క్రెడిల్ రిసెప్షన్ సెంటర్, RTC బస్ స్టాండ్ లో అడాప్షన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చెయ్యడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవరకొండ పట్టణంలో గల ప్రసూతి వైద్యశాల ఏరియా హాస్పిటల్ , RTC బస్ స్టాండ్ లో అడాప్షన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చెయ్యడం జరిగింది దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి సిడిపిఓ చంద్రకళ ఆధ్వర్యంలో ఉయ్యాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమం లో ముఖ్య అతిథిగా దేవరకొండ సిఐ వెంకట్ రెడ్డి , సిడిపిఓ చంద్రకళ, డీసీపీయు అంజలి మాట్లాడుతూ తల్లి దండ్రులకు భారంగా పెంచ లేని స్థితి అనిపించిన శిశువులను అనారోగ్యం కారణంగా జన్మించిన శిశువులను అలాగే శిశువులకు జన్మనిచ్చి సమాజానికి భయపడి జన్మనిచ్చిన శిశువులను ఎక్కడో చెత్తకుప్పలోను కాలువల్లోనూ పడేస్తూ ఎన్నో శిశు మరణాలకు కారణాలు అవుతున్న సమయం లో అటువంటి అనర్థాలు జరగకుండా అనడమే ఈ




ఉయ్యాల కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అటువంటి శిశువులను ఈ యొక్క ఉయ్యాలలో వేయడం వలన ఆ యొక్క శిశువులను జిల్లా పరిధిలో గల శిశుగృహకు పంపించి ఆ యొక్క శిశువు ఆలనా పాలనను చూసుకోవడం జరుగుచున్నది అలాగే ఎవరికైనా పిల్లలు దత్తత కావాలి అనుకుంటే అట్టి తల్లిదండ్రులకు లీగల్ గా చట్టపరమైన దత్తత ఇవ్వడం జరుగుతుంది కావున ఈ యొక్క విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలిసేలా అందరూ కృషిచేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పటల్ సూపరిడెంట్ రవి ప్రకాష్ ,జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ అంజలి సిడిపిఓ చంద్రకళ, సూపర్వైజర్స్ విజయలక్ష్మి, RTC DM, సూపర్వైజర్ ఏరియా హాస్పిటల్ డాక్టర్ స్. రవి ప్రకాష్ , కృష్ణ , మోతీలాల్ మరియు అంగన్వాడి టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ అన్నపూర్ణకు ఘన సన్మానం

- సన్మానం చేసిన విజయ డైరీ మేనేజర్ శరణ్య రెడ్డి

**జయభేరి, గజ్వేల్, మే 01 :**

గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ లో ఇటీవల రాష్ట్ర ఉత్తమ గైనకాలజిస్ట్ మరియు ఉత్తమ సిహెచ్ఎస్ అవార్డు అందుకున్న డాక్టర్ అన్నపూర్ణ ను విజయ డైరీ మేనేజర్ శరణ్య రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం తన ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని ఆసుపత్రిలోని ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసిన అంకిత భావానికి ఈగౌరవం దక్కిదాని కొనియాడారు. శానిటేషన్ సిబ్బంది ఒక కుటుంబంగా కలిసి పనిచేయడం వల్లనే ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ అవార్డు నాపై బాధ్యత మరింత పెంచిందన్నారు సిద్దిపేట జిల్లాలోని వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేసేందుకు నా వంతు కృషి చేస్తామన్నారు. నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, దీపకు ఆంజనేయులు హాస్పిటల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జగన్ డ్యాన్స్ స్టూడియో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

**జయభేరి, దేవరకొండ :**

విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని దేవరకొండ సీఐ పి వెంకట్ రెడ్డి తెలిపారు. పట్టణంలో నూతనంగా ప్రారంభించిన జగన్ డ్యాన్స్ స్టూడియో సమ్మర్ క్యాంప్ లో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్టూడియోలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవుల్లో పిల్లలు సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా, ఇలాంటి శిక్షణా శిబిరాల ద్వారా తమలోని ప్రతిభకు పదును పెట్టలని,డ్యాన్స్, వంటి అంశాలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. స్టూడియోలో వెస్ట్రన్, ఫోక్, జుంబా, దండియా వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సింహులు, ఆర్.కె. సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్నా రామకృష్ణ, ముషీని అంజన్, కరాటే మాస్టర్ శ్రీను, కౌన్సిలర్ సాయి, డ్యాన్స్ మాస్టర్ క్రాంతి, గుండాల వెంకట్ యాదవ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలి

- ఉమ్మడి పాలమూరు జిల్లా జేఏసీ షాద్ నగర్ శాఖ

**జయభేరి, షాద్ నగర్, మే 01 :**



పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా మహబూబ్ నగర్ జిల్లాలోని పది లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 11 సంవత్సరాల కిందట ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.ఇప్పటివరకు ఒక లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు! కానీ 90% ప్రాజెక్టు పూర్తయిందని ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని జేఏసీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... మహబూబ్ నగర్ జిల్లా చెందిన మన ముఖ్యమంత్రి తక్షణం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చెయ్యాలని కోరుతున్నాం.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన తరువాతనే మిగతా ప్రాంతాలకు సాగునీరు అందించగలరని డిమాండ్ చేస్తున్నాం.కృష్ణా నది పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు వైయస్ రాజశేఖర్ రెడ్డి అక్రమంగా ఏ విధంగా అయితే తరలించుకు వెళ్లాడో అదేవిధంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకము నుండి డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నల్లగొండ రాజకీయ నాయకత్వం పాలమూరు రైతాంగం యొక్క కడుపు కొట్టి నీటిని తరలించుకుపోవడానికి కుట్ర చేస్తున్నది.పాలమూరు జిల్లా రాజకీయ నాయకత్వం ఇప్పటికైనా మేల్కొనాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని పాలమూరు జిల్లా రైతాంగం తరఫున డిమాండ్ చేస్తున్నాం.లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో టీజీ శ్రీనివాస్, మందారం నరసింహులు ,గొర్ల రాము,బిజిలి సత్యం,రవికుమార్,తిరుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు పొందిన నల్ల నరేందర్, నల్ల శ్రీను



**జయభేరి, ములుగు, మే 01 :**

మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గం మాదిగ హక్కుల దండోరా ఇంచార్జ్ నల్ల నరేందర్, జిల్లా అసైన్డ్ భూముల సాధన అధ్యక్షులు నల్ల శ్రీను లకు హైదరాబాద్లోని రవీంద్రభారతిలో దళిత రత్న అవార్డును మాదిగ హక్కుల రాష్ట్ర అధ్యక్షులు సునీల్ మాదిగ, గౌరవ అధ్యక్షులు పెరుమాండ్ల రామకృష్ణ, జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ రోజా రాణిల చేతుల మీదగా ప్రధానోత్సవం చేశారు.మాదిగ సామాజిక వర్గానికి చేస్తున్న సేవలను గుర్తించి, తమకు ఈ అవార్డు ఇచ్చినట్లు నరేందర్, శ్రీను తెలిపారు.ములుగు మండలానికి చెందిన మమల్ని ఈ ఆవార్డుకు ఎంపిక చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు.ఈ సందర్భంగా వారు అవార్డు గ్రహీతలను పలువురు అభినందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవి, గొంగటి రాజు, బొగ్గుల అశోక్, గొంగటి కృష్ణ, బొడ్డు లింగం, మన్నే రేగొండ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ పట్టాలు వద్దు పలుగు పారా ముద్దు

- ఉన్నత చదువులు చదివి కార్మికులుగా రాణిస్తున్న రోళ్ల కల్ యువత

**జయభేరి, గుడిపల్లి :**



ఉన్నత చదువులు చదివి కార్మికులుగా రాణిస్తున్న రోళ్లకల్ యువత అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలం రోళ్ల కల్లు గ్రామం లోని భవన నిర్మాణ దొండ పందిరి నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఎస్ ఫౌండేషన్ చైర్మన్ , బిఆర్ఎస్ యువ నాయకులు గోలి గిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉన్నత చదువులు చదివి నిరుద్యోగాన్ని కూకటి వేళ్ళతో పెకిలిస్తూ వ్యవసాయం అనే సాయంతో రైతులకు చేదోడు వాదోడుగా దొండ పందిరి నిర్మాణాలను చేపడుతున్నారు. చదువుకొని నిరుద్యోగులుగా ఉండకుండా తమ యొక్క శ్రమ శక్తితో కర్షక కార్మికులుగా రాణిస్తున్న రోళ్ల కల్ యువతనుగోలి గిరి అభినందించారు. గత కొన్నేళ్ల నుంచి మన రాష్ట్రమే కాదు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్న దొండ సాగుకు ఉమ్మడి పీఏ పల్లి మండలం పెట్టింది పేరు, కానీ నేడు ఇతర జిల్లాలలో పంట విస్తరణకు రోళ్లకల్ యువత శ్రమిస్తున్నారు. వారి శ్రమను గుర్తించిన గోళిగిరి, ఈరోజు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని 50 మంది కార్మికులకు డ్రెస్ కోడ్ పంపిణీ చేశారు. మేడే యొక్కఆవిష్యాకత ను వివరిస్తూ కార్మికులందరూ ఐకమత్యంతో తమ యొక్క హక్కుల సాధన కోసం పాటుపడాలన్నారు. శ్రమ శక్తి దోపిడి వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతి కార్మికుడు తన యొక్క వృత్తి నైపుణ్యాన్ని పాటిస్తూ మరిన్ని అవకాశాలను చేజిక్కించుకోవాలన్నారు. మే నెలలో భానుడు భగభగ మండుతుండడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికులు ప్రమాదవశత్తు ప్రమాదానికి గురి అయితే వారికి నా వంతుగా ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారేపల్లి రమేష్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు, పచ్చిపాల అంజయ్య, గణపురం రఘు, దొండ పందిరి నిర్మాణ సంఘం అధ్యక్షులు, పచ్చిపాల నరసింహ, మెరుగు యాదగిరి, ఏడుపుల కొండలు, మారేపల్లి జయేందర్, నారాయణదాసు శంకర్, ఇతర కార్మికులు ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, మే 01:**

శుక్రవారం పరకాల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డుకు చెందిన గోవింద సంధ్య సత్యనారాయణ (శ్రీ కుంకుమేశ్వర ఆలయ ధర్మకర్త ప్రభుత్వ రిటైర్డ్ టీచర్) దంపతుల కూతురు అఖిలనరేష్ ల వివాహం పరకాల లోని జి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్లో జరగగా ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులుసోదా రామకృష్ణ, ఏ కార్యక్రమంలో రామకృష్ణ తో పాటుగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ మడికొండ సంపత్ కుమార్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, కోటి తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మురంగా కొనసాగుతున్న ప్రధాన మురుగు నీటి కాల్వ పనులు

- ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి కొండమల్లేపల్లి లో గత కొంతకాలంగా పెండింగ్లో ఉన్నటువంటి ప్రధాన మురుగునీటి కాలువ సమస్య పరిష్కారమే ధ్యేయంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రధాన మురికినీటి కాలువల పనులను స్థానిక సర్పంచ్ పసునూరు రెడ్డి ప్రారంభించి పర్యవేక్షించడం జరిగింది వర్షాకాలంలో వర్షం నీరు మరియు మురుగునీరు నిలిచిపోకుండా అధిక నాణ్యత కలిగిన సిమెంట్ పైపులతో నిర్మాణం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రధాన మురుగునీటి కాలువ పనులు మెరుగు పడటం వల్ల గ్రామంలో ప్రజలకు దోమల బెడద తగ్గి గ్రామ ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని గ్రామ సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి పంచాయతీ పాలక వర్గం సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెద్ద ముప్పారం లో ఘనంగా మే డే వేడుకలు



- తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న

**జయభేరి, దంతాలపల్లి, మే 01 :**

మండలం, పెద్ద ముప్పారం గ్రామంలో అమాలి కార్మికుల ఆధ్వర్యంలో 140వ మే డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోరగుండ్ల మోహన్ అధ్యక్షత వహించగా, సీనియర్ అమాలి కార్మికుడు ఈదురు బిక్షపతి జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. మే డే అనేది కేవలం పండుగ కాదు, అది కార్మిక వర్గ పోరాటాల చరిత్రకు ప్రతీక అని అన్నారు. ఒకప్పుడు కార్మికులు 18 గంటలపాటు బానిసల మాదిరిగా పని చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొని, తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న 8 గంటల పని దినం కార్మికుల ఐక్యతకు నిదర్శనమని గుర్తు చేశారు. నేటి కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఆర్ఎస్ఎస్‌బిజెపి పాలనలో కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ల పేరుతో చట్టాలను మార్చి కార్మికులను మరింత అసురక్షిత స్థితిలోకి నెడుతున్నదని తీవ్రంగా విమర్శించారు. ఈ విధానాలు ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తూ, కార్మికులను రోడ్డున పడే పరిస్థితికి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

విశ్లేషణ:

మే డే చరిత్ర మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది—హక్కులు ఎవరు ఇచ్చేవి కావు, పోరాడి సాధించుకోవాల్సినవే. ప్రస్తుతం జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలు చూస్తే, గతంలో సాధించిన హక్కులు కూడా క్రమంగా కోల్పోతున్న ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుంది. కాంట్రాక్టు వ్యవస్థ, అసంఘటిత రంగం పెరుగుదల, వేతన అసమానతలు—all ఇవి కార్మిక వర్గాన్ని మరింత బలహీనపరుస్తున్నాయి. నేపథ్యంలో కార్మికులు, కర్షకులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ముందుకు వచ్చి పోరాటాలు తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మే డే స్ఫూర్తిని కేవలం ఒకరోజు పాటించకుండా, ప్రతిరోజూ జీవన పోరాటంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమాలి కార్మికులు స్వామి, రమేష్, మల్లేశం, లింగయ్య, శంకర్, దేవరపు సోమయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు అద్దాలు పంపిణీ

- పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది
- లక్ష్మీపురం సర్పంచ్ నల్ల ఆంజనేయులు



**జయభేరి, దంతాలపల్లి, మే 01 :**

మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రజలకు పుష్పగిరి కంటి దావకాన హైదరాబాద్ వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని లక్ష్మీపురం సర్పంచ్ నల్ల ఆంజనేయులు అన్నారు, హాస్పటల్ యాజమాన్యం మాకు సహకరించి గ్రామంలో వైద్య సేవలు అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో గ్రామ ప్రజలు పుష్పగిరి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన సాయి రస్మితను శాలువాతో సన్మానం



**దేవరకొండ :**

రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన దేవరకొండ నియోజకవర్గం సాయి రస్మిత MPC . ప్రథమ సంవత్సరం లో 468/470 కు శుభాకాంక్షలు తెలిపుతు శాలువాతో సత్కరించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్.

## వివాహ వేడుకల్లో ప్రశాంత్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర నియోజకవర్గం లో శుక్రవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా
# శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

జయభేరి, తుర్కపల్లి, మే 01 :

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ పురోహితుడు రమాకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని అమ్మవార్లను ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వేద బ్రాహ్మణులు వేద మంత్రోచరణాలతో కళ్యాణ తంతును కమనీయంగా నిర్వహించారు. కళ్యాణమనంతరం భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



**స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్..**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్ర చరణాల మధ్య సాంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవాన్ని తిలకించారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా విశేష అలంకరణతో స్వామి అమ్మవార్లను అలంకరించి పుణ్యావాచనం, వ్రతాలు, కన్యాదానం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు వంటి పావనమైన తంతువులు ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ప్రభుత్వ విప్ భక్తి భావనతో పాల్గొని ప్రత్యేక హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను సాంప్రదాయాలను పరిరక్షించేలా దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచులు కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, చాడ భాస్కర్ రెడ్డి, సోమల వెంకటేశం, బురి వీరన్న నాయక్, జేరిపోతుల కరుణాకర్, రాజారాం నాయక్, మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉదయ్ రెడ్డి, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు కొడపాక అక్షిత మహేష్, నారా నాగరాజు, రాగుల మహేశ్వరి మల్లేశం, కొడపాక నరసింహులు, పల్లెపాటి అనిల్, నాగరాజు, కల్లూరి చిన్న నరసింహారెడ్డి, కల్లూరు జగన్మోహన్ రెడ్డి, చిలువేరు రవి, కర్రే రాజ్ కుమార్ గౌడ్, కల్లూరి శ్రీనివాస్ రెడ్డి, కల్లూరి సతీష్ రెడ్డి, ఆరుట్ల అమరేందర్ రెడ్డి, కల్లూరి వాసుదేవ్ రెడ్డి, కల్లూరి మధుసూదన్ రెడ్డి, రాగుల శ్రీనివాస్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

జయభేరి, తుర్కపల్లి, మే 01 :



మే 10వ తేదీన నిర్వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేపట్టి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. సోమవారం 4వ తేదీన కొలనుపాక జైన్ మందిరంలో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు మండలంలోని ప్రతి కార్యకర్త తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లు నరసింహ యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు శత్రు నాయక్, జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి మాలోతు రమేష్ నాయక్, మోత్కుపల్లి బిక్షపతి, వార్డు సభ్యులు బత్తుల అనిల్ కుమార్, సోమోళ్ల కర్ణాకర్, గుండెబోయిన మల్లేశం, ప్రభాకర్, వల్లపు ప్రసాద్, కానుగంటి భాను యాదవ్, పాల్గొన్నారు.

## నాగార్జున గ్రామీణ బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ ఘనంగా వేడుకలు

జయభేరి, యాదగిరిగుట్ట, మే 01 :




నాగార్జున గ్రామీణ బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు గురువారం యాదగిరిగుట్టలోని మున్నూరు కాపు సత్రం ట్రస్ట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆర్.సుభాష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నాగార్జున గ్రామీణ బ్యాంకు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు చేసుకోవడం ఆనందకరమని అన్నారు. నాగార్జున గ్రామీణ బ్యాంకు ఉద్యోగులంతా కలిసికట్టుగా అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఒక సంస్థ 50 సంవత్సరాల వేడుకలు జరుపుకోవడం అంటే మామూలు విషయం కాదని అన్నారు. ఇలాంటి వేడుకలు మరిన్ని జరుపుకోవాలని అన్నారు. నాగార్జున గ్రామీణ బ్యాంక్ చెందిన పలువురు సీనియర్ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకలు సందర్భంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ సిబ్బందిని గౌరవించి ఘనంగా సత్కరించారు. అనంతరం గోల్డెన్ జూబ్లీ వేడుకల కమిటీ చైర్మన్ మారిశెట్టి వీరయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కుంభం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నలుమూలాల నుండి ఎండలను సైతం లెక్కజేయకుండా పూర్వ నాగార్జున గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు దూర ప్రాంతాలైన విశాఖపట్నం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాల నుండి విచ్చేసిన అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. నాగార్జున గ్రామీణ బ్యాంకు గోల్డెన్ జూబ్లీ సభలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా రీజనల్ సెక్రటరీ బర్రె సుదర్శన్, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్. శ్రీనివాసులు, నాబార్డ్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ మోహనయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఛీఫ్ మేనేజర్ సుశాంత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజారావు, కె.టీ.రాజు, సంగమేశ్వర గ్రామీణ బ్యాంకు మాజీ చైర్మన్ రామచంద్రా రెడ్డి, మాజీ జనరల్ సెక్రటరీ గణపతి హెగ్డే, రవికాంత్, యాదగిరిగుట్ట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శాలిని తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఫోన్ లో సూచనలు

జయభేరి, దేవరకద్ర :



వరి కొనుగోళ్ల ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని అధికారులకు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఫోన్ లో ఆదేశించారు. దేవరకద్ర మండలం బసవాయపల్లి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

దీంతో స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ అప్పటికప్పుడే ఫోన్ లో సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

రైతులకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా, యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ చేపట్టాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.



## ఎస్సై రవికుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన పాత్రికేయులు

జయభేరి, దంతాలపల్లి, మే01 :

మండలానికి నూతన ఎస్సై రవికుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన దంతాలపల్లి మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో శాలువాతో ఎస్సై ని సన్మానించారు, మండలంలో ఉన్న సమస్యలను పరిష్కారానికి ఐకమత్యం కృషి చేద్దామని ఎస్సై అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాత్రికేయులు పంతం సురేందర్, చిల్ల నిరంజన్, పంతం విజయేందర్, వెంకన్న, జుంకీలాల్ కరుణాకర్, అనపర్తి వీరన్న, మడతపెల్లి సురేందర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



జయభేరి, తుర్కపల్లి, మే 01 :

విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య, సర్పంచ్ సోమల వెంకటేశం లు అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 564 మార్కులు సాధించి మండల్ టాపర్గా తాటికొండ వైష్ణవి ఆమె తల్లిదండ్రులను సన్మానించి పారితోషకాన్ని ,500 పైగా మార్కులు సాధించిన గౌతమి, జ్యోతి, మేనక,లను అభినందించి, నగదు పారితోష్కాన్ని డాక్టర్ చెన్న కిష్టయ్య అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నందున విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాల, గ్రంథాలయం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉన్నందున ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా విద్యార్థులను తల్లిదండ్రులను ప్రోత్సహించాలని ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బొరెడ్డి మహిపాల్ రెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి, ఉపాధ్యాయులు పలుగుల సతీష్ కుమార్, భూక్య గోవింద్, పెద్దాకుల భాస్కర్, నారి అనూష పాల్గొన్నారు.

## గుండ్ల పోచంపల్లిలో ఘనంగా మేడే వేడుకలు




జయభేరి, మేడ్చల్, మే 01 :

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గుండ్ల పోచంపల్లి పరిధిలోని అపారెల్ ఎక్స్‌పోర్ట్ పార్కులో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని మేడే స్ఫూర్తిని ప్రతిబింబించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐఎన్‌టీయూసీ నాయకుడు కావేరి శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సముచిత వేతనాలు, సురక్షిత పనిస్థలాలు మరియు గౌరవప్రదమైన జీవితం కోసం కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం సంఘటిత పోరాటం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్‌టీయూసీ నాయకుడు అమరం సురేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొడ్ల మోహన్ ముదిరాజ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు మహిపాల్ రెడ్డి, గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నాయకుడు బట్టికాడి విజయ్ కుమార్ ముదిరాజ్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరంగవరం నవీన్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు హాజరై మేడే వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి, భూత్పూర్ మండలం మద్దిగట్ల లలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు.ఈ సందర్భంగా తమ కుటుంబం తరఫున ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కొత్తకోటలో పలు వివాహ వేడుకలలో కూడా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## సిపిఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు

జయభేరి, శామీర్‌పేట్, మే 1 :

మేడే సందర్భంగా మూడుచింతల పల్లి మండలం కేశవరం గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తప్పెట్ల రాములు గౌడ్ ఆధ్వర్యంలో సీపీఐ జెండా ఎగురవేయగా ఈ కార్యక్రమంలో 20 వ వార్డు కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ఎంతో మంది పోరాటం చేశారని వారి గుర్తుగా కార్మికుల దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మలపల్లి వెంకటేష్ యాదవ్, కొంపల్లి యాదగిరి గౌడ్, ఉడుతల ఆగమయ్య గౌడ్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

- గోనె హన్మంత్ రెడ్డి



జయభేరి, శామీర్‌పేట్, మే 1 :

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ లుగా ఎన్నికైన 4వ వార్డు కౌన్సిలర్ దీపిక వరప్రసాద్ రెడ్డి, 5వ వార్డు వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి లను ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు గోనె హన్మంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్, వైస్ చైర్మన్ లుగా గెలుపొందడం సంతోషకరమని అన్నారు. ప్రజా సేవలో పాల్గొంటూ వారికి మరింతగా చేరువ కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ట్రస్మా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, ట్రెజరర్ దివ్య జ్యోతి, సభ్యులు శివశంకర్, పంచాక్షరి, సూరజ్, వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మేడే వేడుకలు

- పారిశుధ్య కార్మికులకు పండ్లు నగదు పంపిణీ చేసిన సీనియర్ ఉద్యమ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్



జయభేరి, శామీర్‌పేట్, మే 1 :

శామీర్ పేట మండల కేంద్రంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నేత మహ్మద్ అఫ్జల్ ఖాన్, బత్తిన రాజుగౌడ్, పి. నర్సింహ రెడ్డిలు పారిశుధ్య కార్మికులకు పండ్లు, నగదు పంపిణీ చేశారు. అనంతరం అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ శ్రమజీవుల చెమట చుక్కతోనే మానవజాతి పురోగమిస్తుందని తెలిపారు. కష్టజీవుల భాగస్వామ్యంతోనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిసార్ అహ్మద్ ఖాన్, జూపల్లి వేణుగోపాల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# రాజస్థాన్‌పై ఘనవిజయం

ఐపీఎల్ 19లో హ్యాట్రిక్ పరాభవాల తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ గెలుపుబాట పట్టింది. రాజస్థాన్ రాయల్స్‌ను వారి సొంత మైదానంలో చిత్తుచేస్తూ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదుచేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచింది. రాయల్స్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ.. 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 75, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), పతుమ్ నిశాంక (33 బంతుల్లో 62, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. తొలుత రియాన్ పరాగ్ (50 బంతుల్లో 90, 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు డొనొవన్ ఫెరీరా (14 బంతుల్లో 47 నాటౌట్, 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 225 రన్స్ చేసింది. రాయల్స్‌కు ఇది నాలుగో ఓటమి. భారీ ఛేదనలో క్యాపిటల్స్ ఎక్కడా తగ్గలేదు. పవర్ ప్లేలోనే నిశాంక, రాహుల్ మెరుపులతో ఆ జట్టు వికెట్లేమీ నష్టపోకుండా 70 రన్స్ చేసింది. ముఖ్యంగా నిశాంక.. బౌలర్ ఎవరన్నదీ చూడకుండా ఆది నుంచే దంచుడు మంత్రాన్ని జపించాడు. ఆర్చర్ ఓవర్లో 4, 6తో బాదుడుకు శ్రీకారం చుట్టిన అతడు.. మూడో ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్‌తో రెచ్చిపోయాడు. బర్గర్ బౌలింగ్‌లోనూ రెండు సిక్స్‌లు కొట్టిన ఈ శ్రీలంక బ్యాటర్.. బ్రిజేష్ ఓవర్లో మిడ్‌వికెట్ బౌండరీతో 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఐపీఎల్‌లో అతడికిదే తొలి ఫిఫ్టీ. మరో ఎండ్‌లో రాహుల్.. బిష్ణోయ్‌ను లక్ష్యంగా చేసుకుని 4, 6, 6 బాదడంతో 9 ఓవర్లకే ఢిల్లీ 108/0తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. అయితే జడ్డూ పదో ఓవర్లో నిశాంకను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. నిశాంక నిష్క్రమించినా మూడో స్థానంలో వచ్చిన నితీష్ రాణా (17 బంతుల్లో 33, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండగా రాహుల్ గెలుపు బాధ్యతలను భుజానికెత్తుకున్నాడు. 27 బంతుల్లో అతడి అర్ధ శతకం పూర్తయింది. జడేజా 12వ ఓవర్లో 18 రన్స్ పిండుకున్న ఈ ద్వయం బర్గర్ బౌలింగ్‌లోనూ రెండు సిక్స్‌లు, ఫోర్ బాది రెండో వికెట్‌కు 30 బంతుల్లోనే 61 రన్స్ జోడించింది. కానీ ఐదు బంతుల వ్యవధిలో ఈ ఇద్దరూ నిష్క్రమించారు. రాణాను తుషార్, రాహుల్‌ను ఆర్చర్ ఔట్ చేయగా.. ప్రత్యర్థిపై రాయల్స్ బౌలర్లు ఒత్తిడి పెంచే యత్నం చేసినా అవి ఫలించలేదు. ఆఖరి 3 ఓవర్లలో క్యాపిటల్స్ విజయానికి 30 రన్స్ అవసరమవగా స్టబ్స్ (18*), అశుతోష్ (25*) లాంఛనాన్ని పూర్తిచేశారు.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలినా ఈ సీజన్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో విఫలమవుతున్న పరాగ్ అసలైన సమయంలో ఫామ్‌లోకి వచ్చాడు. ముందు జురెల్, తర్వాత జడేజాతో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఆసీస్ దిగ్గజ పేసర్ స్టార్క్, జెమీసన్ మొదట్లోనే రాయల్స్‌ను దెబ్బకొట్టారు. స్టార్క్ బౌలింగ్‌లో మొదటి బంతినే భారీ సిక్స్ కొట్టిన యశస్వి జైస్వాల్ (6).. ఫుల్‌టాస్‌గా విసిరిన మూడో బంతికి అతడికే క్యాచ్ ఇచ్చాడు. వండర్ కిడ్ వైభవ్ (4)ను జెమీసన్ క్లీన్‌బౌల్డ్ చేయడంతో రాయల్స్ 12 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన పరాగ్.. జురెల్ (30 బంతుల్లో 42, 4 ఫోర్లు, 1 సిక్స్) అండతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జెమీసన్ ఓవర్లో రెండు సిక్స్‌లతో పాటు బౌండరీతో జోరు పెంచిన అతడు.. అక్షర్ ఓవర్లోనూ రెండుసార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. మరో ఎండ్‌లో జురెల్ కెప్టెన్‌గా పూర్తి అండగా నిలిచాడు. నటరాజన్ ఓవర్లో లాంగాన్ మీదుగా సింగిల్‌తో పరాగ్ సీజన్‌లో తొలి అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. ధాటిగా ఆడుతున్న ఈ జోడీని ఢిల్లీ కెప్టెన్ అక్షర్ 12వ ఓవర్లో జురెల్‌ను ఔట్ చేయడంతో 102 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. జడ్డూ (20) నెమ్మదిగా ఆడినా పరాగ్ జోరు తగ్గించలేదు. జెమీసన్ ఓవర్లో హ్యాట్రిక్ బౌండరీలతో రెచ్చిపోయిన అతడు శతకానికి చేరువయ్యాడు. కానీ రెండో స్పెల్‌కు వచ్చిన స్టార్క్.. ఒకే ఓవర్లో జడ్డూ, పరాగ్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆఖర్లో ఫెరీరా.. ఆకాశమే హద్దుగా చెలరేగి రాయల్స్ ఇన్నింగ్స్‌కు అదిరిపోయే ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. కుల్‌దీప్ వేసిన 18వ ఓవర్లో మూడు సిక్స్‌లు దంచిన అతడు.. చివరి రెండు ఓవర్లలోనూ షాట్లు ఆడటంతో ఆతిథ్య జట్టు భారీ స్కోరు సాధించింది.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లకు 225/6 (పరాగ్ 90, ఫెరీరా 47*, స్టార్క్ 3/40, అక్షర్ 1/39); ఢిల్లీ: 19.1 ఓవర్లకు 226/3 (రాహుల్ 75, నిశాంక 62, జడేజా 1/33, తుషార్ 1/38)





# మూడో స్థానంలో టీమ్ఇండియా..

## ఐసీసీ వార్షిక టెస్టు ర్యాంకింగ్స్

మూడో స్థానంలో టీమ్ఇండియా.. ఐసీసీ వార్షిక టెస్టు ర్యాంకింగ్స్ ఐసీసీ వార్షిక టెస్టు ర్యాంకుల్లో భారత జట్టు మూడో స్థానం దక్కించుకుంది. ఏడాదిన్నర కాలంగా టెస్టుల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక చతికిలపడుతున్నప్పటికీ 104 రేటింగ్ పాయింట్లతో ఇంగ్లండ్ (102)ను వెనక్కి నెట్టి మూడో స్థానానికి ఎగబాకింది.

ఐసీసీ వార్షిక టెస్టు ర్యాంకుల్లో భారత జట్టు మూడో స్థానం దక్కించుకుంది. ఏడాదిన్నర కాలంగా టెస్టుల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక చతికిలపడుతున్నప్పటికీ 104 రేటింగ్ పాయింట్లతో ఇంగ్లండ్ (102)ను వెనక్కి నెట్టి మూడో స్థానానికి ఎగబాకింది. ర్యాంకుల్లో నిరుడు మే నుంచి ఆడిన అన్ని మ్యాచ్‌లను కలుపుకుని జట్లకు వెయిటేజీ ఇవ్వగా ఆస్ట్రేలియా మరోసారి తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. దక్షిణాఫ్రికా (119) రెండో స్థానంలో ఉంది. టాప్ 10లో న్యూజిలాండ్ ఐదో స్థానంలో ఉండగా ఆ తర్వాత వరుసగా పాకిస్థాన్, శ్రీలంక, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ నిలిచాయి. మహిళల వన్డే వార్షిక ర్యాంకింగ్స్‌లోనూ ఆసీస్ (163 రేటింగ్ పాయింట్లు) అగ్రస్థానంలో ఉండగా ఇంగ్లండ్, భారత్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ టాప్5లో ఉన్నాయి.



# రోజూ 45 నిమిషాలు వాకింగ్

### జీవితంలో జరిగే అద్భుతమైన మార్పు ఏంటో తెలుసా!

**ఆరోగ్యంగా ఉండాలంటే జిమ్‌కి వెళ్లి గంటల తరబడి చెమటలు చిందించాలనో, కష్టతరమైన వ్యాయామాలు చేయాలనో చాలామంది భావిస్తుంటారు. కానీ, ఆడంబరాలు లేని అతి సాధారణమైన 'నడక' మన జీవితంలో ఎంతటి మార్పు తీసుకువస్తుందో ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్ కోర్ట్నీ నిరూపించారు. కేవలం 45 రోజుల పాటు, రోజుకు 45 నిమిషాల నడక ఆమె శారీరక, మానసిక స్థితిని ఎలా మార్చేసిందో తెలుసుకుందాం..**

మనం ఏదైనా సాధించాలంటే తీవ్రమైన శ్రమ ఉండాలని అనుకుంటాం. కానీ, ఫిట్‌నెస్ విషయంలో తీవ్రత కంటే 'నిలకడ' ఎక్కువ ఫలితాలను ఇస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 'కోర్ట్నీస్ హెల్త్ కార్నర్' నడిపే కోర్ట్నీ, తన 45 రోజుల నడక ప్రయాణాన్ని పంచుకున్నారు. ఇది కేవలం బరువు తగ్గడం గురించి మాత్రమే కాదు, జీవితంపై ఆమె దృక్పథాన్ని మార్చిన ఒక అద్భుత ప్రయాణం.

**క్రమశిక్షణకు పునాది**

ప్రతిరోజూ 45 నిమిషాల పాటు నడవాలనే నిశ్చయించుకోవడం కోర్ట్నీలో ఒక తెలియని ఉత్సాహాన్ని నింపింది. తనకు తాను ఇచ్చుకున్న మాటను నిలబెట్టుకోవడం వల్ల ఇతర పనుల్లో కూడా క్రమశిక్షణ పెరిగింది. "రోజువారీ నడక నా జీవితంలోని ఇతర పనులను సులభతరం చేసింది. ఒక మంచి ఎంపిక మరో మంచి నిర్ణయానికి దారితీసింది" అని ఆమె వివరించారు.

ఈ చిన్న అలవాటు ఆమెలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నడక అనేది కోర్ట్నీకి కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది ఒక 'మీటైమ్'. గందరగోళంగా ఉన్న మనసుతో నడక మొదలుపెట్టినా, ముగించే సమయానికి చాలా ప్రశాంతంగా, ఉల్లాసంగా అనిపించేదట. కుటుంబ సభ్యుల సహకారంతో ఎలాంటి అంతరాయం లేని ఈ సమయం ఆమెలోని ఒత్తిడిని తగ్గించి, మానసిక స్పష్టతను ఇచ్చింది.

**పెరిగిన శారీరక సామర్థ్యం..**

మొదట్లో ట్రెడ్‌మిల్ మీద కొంచెం వాలు కూడా కష్టంగా అనిపించిన కోర్ట్నీకి, 45 రోజుల నిరంతర సాధనతో 5 నుండి 10 శాతం వాలును కూడా సులభంగా అధిగమించే స్టామినా పెరిగింది. క్రమం తప్పకుండా చేసే చిన్న ప్రయత్నం కూడా కాలక్రమేణా గొప్ప శారీరక శక్తిని ఇస్తుందని ఆమె నిరూపించారు. ఒక ఉపాధ్యాయురాలిగా ఉన్న కోర్ట్నీకి, నడక సమయంలో కొత్త ఆలోచనలు రావడం మొదలైంది.

స్క్రీన్లకు, బాధ్యతలకు దూరంగా నడుస్తున్నప్పుడు ఆమె మెదడు స్వేచ్ఛగా ఆలోచించి, పాఠ్యాంశాల ప్రణాళికలు, సమస్యల పరిష్కార మార్గాలను కనుగొనేది. నడక అనేది మెదడుకు విరామ సమయంలా పనిచేసి, సృజనాత్మకతను పెంచిందని ఆమె పేర్కొన్నారు.


పెద్ద పెద్ద మార్పుల కంటే స్థిరంగా చేసే చిన్న పనులే జీవితాన్ని మారుస్తాయి. ఖరీదైన జిమ్ మెంబర్‌షిప్‌లు, కష్టమైన డైట్‌లు లేకుండానే కేవలం 'నడక'తో కోర్ట్నీ తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకున్నారు. మీరు కూడా మీ జీవితంలో మార్పు కోరుకుంటున్నారా? అయితే, ఈరోజే ఒక చిన్న అడుగు వేయండి!



## కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్..



డబ్ స్మాష్ వీడియోలు, ఇన్ స్టా గ్రామ్ రీల్స్ తో బాగా ఫేమస్ అయ్యిందీ అందాల తార. తన క్యూట్ నెస్ తో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. అదే క్రేజ్ తో బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షోలోనూ అడుగు పెట్టింది. ఆ తర్వాత సినిమాల్లోనూ ఎంట్రీ ఇచ్చింది. బిగ్ బాస్ రియాలిటీ షోతో బాగా ఫేమస్ అయిన అషురెడ్డి పై ఈ మధ్యన సంచలన ఆరోపణలు వచ్చాయి. లండన్‌కి చెందిన ధర్మేంద్ర అనే ఎన్నారై నుంచి రూ. 9.5 కోట్లు తీసుకుని మోసం చేసిందని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ధర్మేంద్ర తండ్రి.. హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు.. అషూరెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు సీసీఎస్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఎలాంటి వాస్తవాలు లేవని, అందుకే ఆ కేసుని కొట్టేయాలని కోర్టులో అషూ రెడ్డి అభ్యర్థించినట్టుగా సమాచారం. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు సాగుతోంది. కాగా మొన్నటి వరకు ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్‌తో అషు రెడ్డి పేరు నెట్టింట్లో తెగ మార్మోగింది. ఇప్పుడు ఈ కేసుతో ఈ బిగ్ బాస్ బ్యూటీ మరోసారి ట్రెండ్ అవుతోంది.



## ఒకవేళ నేను చనిపోతే?

విమాన ప్రయాణం చేసే ప్రతీసారి తాను పాటించే ఓ సెంటిమెంట్ గురించి అగ్ర నటుడు అమీర్‌ఖాన్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు. ఒకవేళ విమానం ప్రమాదానికి గురై తాను చనిపోతే సినిమాల పరంగా చేయాల్సిన పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేందుకు తన కజిన్, నిర్మాత మన్సూర్‌ఖాన్‌కు ఓ చిన్నలేఖ ద్వారా ముందే అన్ని విషయాలను తెలియజేస్తానని అమీర్‌ఖాన్ చెప్పారు. 'విమాన ప్రయాణం చేసే ముందు మన్సూర్‌కు చిన్న చీటీ రాయడం నాకు అలవాటు. దాదాపు 30 ఏళ్లుగా ఇదే పద్ధతిని పాటిస్తున్నా. ఒకవేళ ఏదైనా జరగకూడనిది జరిగితే సినిమాల నిర్మాణానికి అడ్డంకులు రావొద్దన్నది నా ఆలోచన. అందుకే మిగిలిన పనుల గురించి మన్సూర్‌కు ముందే తెలియజేస్తా. దర్శకులను కూడా మన్సూర్ సలహా తీసుకోవాలని సూచిస్తా. నాకు మన్సూర్ జడ్జిమెంట్ మీద అంత నమ్మకం' అని అమీర్‌ఖాన్ చెప్పారు. తన మాజీ భార్య కిరణ్‌రావుకు చాలా సందర్భాల్లో ఈ సెంటిమెంట్ గురించి చెప్పానని, తనకు ఏమైనా జరిగితే అన్ని విషయాలను మన్సూర్‌ఖాన్ పరిష్కరిస్తాడని, సలహాల కోసం ఆయన్నే సంప్రదించాలని కిరణ్‌రావుకు గుర్తుచేసేవాణ్ణని అమీర్‌ఖాన్ తెలిపారు. ప్రస్తుతం ఆయన మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. అమీర్‌ఖాన్ తొలి చిత్రం 'ఖయామత్ సే ఖయామత్ తక్'కు (1988) మన్సూర్‌ఖాన్ దర్శకత్వం వహించారు. అప్పటి నుంచి వీరి అనుబంధం కొనసాగుతున్నది. మన్సూర్‌ఖాన్ సలహాలు తీసుకోకుండా అమీర్‌ఖాన్ ఏ పని తలపెట్టడని ఆయన సన్నిహితులు చెబుతుంటారు.

## పెద్ది ఆగమనం ఖరారు



ఎట్టకేలకు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా విడుదల తేదీపై సస్పెన్స్ వీడింది. ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేకర్స్ తెలిపారు. ఏప్రిల్ 30న రావాల్సిన ఈ సినిమా జూన్‌కి వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే జూన్ నెలలో రిలీజ్ డేట్‌పై స్పష్టత లేకపోవడంతో అభిమానులు విడుదల ఎప్పుడోనని ఆతృతగా ఎదురుచూశారు. వారి నిరీక్షణకు తెరదించుతూ కొత్త తేదీని ప్రకటించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అగ్ర దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ "పెద్ది'లో చరణ్ పర్ఫార్మెన్స్ 'రంగస్థలం' చిత్రాన్ని దాటి నెక్ట్స్‌లెవల్‌లో ఉంటుంది. నన్ను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. అందరి హృదయాలకు దగ్గరగా ఉండే చిత్రమిదని దర్శకుడు బుచ్చిబాబు సానా పేర్కొన్నారు. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని, ఇదొక ఎమోషనల్ రైడ్ అని, పాన్ ఇండియా రేంజ్‌లో భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నామని నిర్మాత వెంకట సతీశ్ కిలారు అన్నారు. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బొమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు.

## అట్టహాసంగా బెల్లంకొండ రిసెప్షన్..



టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన బ్యాచిలర్ జీవితానికి గుడ్‌బై చెప్పి కావ్య రెడ్డితో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా ఈ వివాహ వేడుక జరిగింది. ఈ శుభవార్తతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 29న తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం సన్నిధిలో ఈ పెళ్లి అట్టహాసంగా జరిగింది. వేదమంత్రాల మధ్య సాయి శ్రీనివాస్ మూడు ముళ్లు వేసి కావ్యను తన జీవిత భాగస్వామిగా స్వీకరించారు. ఈ వేడుకకు ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.

పెళ్లి అనంతరం మే 1న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా వెడ్డింగ్ రిసెప్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం సినీ, రాజకీయ ప్రముఖులతో కళకళలాడింది. టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు.రిసెప్షన్‌కు చిరంజీవి, నాగార్జున, మోహన్ బాబు, నాగ చైతన్య, కాజల్ అగర్వాల్, గోపీచంద్, శ్రీకాంత్, తరుణ్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. అలాగే అలీ, నిర్మాత దిల్ రాజు, రాజకీయ నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. ఈ వేడుకలో చిరంజీవి, మోహన్ బాబు వంటి సినీ దిగ్గజాలకు బెల్లంకొండ కుటుంబం పాదాభివందనం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ క్షణాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సాయి శ్రీనివాస్ తన పెళ్లి ఫోటోలను పంచుకుంటూ తన భార్యను అభిమానులకు పరిచయం చేశారు. ఆమెను "పవర్‌ఫుల్" అని అభివర్ణించడం అభిమానులను ఆకట్టుకుంది. ఈ జంట క్యూట్‌గా కనిపిస్తూ అందరి మనసులు గెలుచుకుంటోంది. ప్రస్తుతం ఈ పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## గ్లామరస్ క్వీన్ క్రేజీ కామెంట్స్

తెలుగులో గ్లామర్ క్వీన్ గా పేరు తెచ్చుకున్న వయ్యారి భామ నిధి అగర్వాల్.. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సవ్యసాచి సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు.. వరుస సినిమాలతోమెప్పించింది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి అలరించింది. తక్కువ సమయంలోనే పాపులర్ అయ్యింది. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. అలాగే గ్లామర్ పరంగా మెప్పించింది. టాలీవుడ్ లో గ్లామరస్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఈ చిన్నదాని క్రేజ్ మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. ఇటీవలే నిధి రెండు పాన్ ఇండియా సినిమాలు చేసింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు సినిమాలో హీరోయిన్ గా చేసింది. కానీ ఈ సినిమాజ ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేదు. అలాగే రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన రాజాసాబ్ సినిమాలో నటించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఇదిలా ఉంటే తాజాగా నిధి అగర్వాల్ ఓ ఇంటర్వ్యూలో తన నెల ఖర్చుల గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. నెలకు మీరు ఎంత ఖర్చు చేస్తారు అనే ప్రశ్నకు.. నా నెలవారి ఖర్చు రూ. 5 లక్షలు అని తెలిపింది. నా ట్రావెలింగ్, బస,డయిట్,జిమ్, ట్రైనర్, పార్లర్ ఖర్చులకే రూ. 5 లక్షలు అవుతుంది. ఇవి కాకుండా మేకప్, హెయిర్‌స్టైలింగ్, ఫోటోస్ లాంటి ఖర్చులను కొన్ని సార్లు కార్యక్రమాల నిర్వాహకులు చెల్లించినా, కొన్ని సార్లు నేను భరించాల్సి ఉంటుంది అని తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**